# కవిత్వం

## సృజనానుభవం

యాకూబ్

# సృజనానుభవంలోకి...


**కొత్తచిగుళ్ళు తొడిగిన 'సృజనానుభవ' వసంతం ........ 9**

*–నారాయణస్వామి వెంకటయోగి*

పదాల్లో ఏముంది? .................................. 23

కవిత్వమంటే... ........................................ 27

భాషకు ప్రాణం కవిత్వం ................................ 31

అసలు కవిత్వం అంటే ఏమిటి? ........................ 35

కథాకావ్యాలు ............................................ 40

ఛందస్సులు ఛాందసమా? ............................... 44

పరుచుకున్న వెన్నెలే కవిత్వం ........................... 48

కవిత్వం చదవడంకూడా సృజనానుభవమే! ............ 53

ఇంటర్నెట్ కవిత్వం........................................ 56

కవిత్వం సాపేక్షం........................................ 61

కవితాత్మక ధ్వని ........................................ 65

వచన కవిత – క్రమబద్ధ లయ ........................ 70

భావం, భావుకత, సహజలయ .......................... 76

ప్రతిభ, పరిశ్రమ, సాధన ................................ 80

అర్థాలంకారాలు ........................................ 85

ఉత్ప్రేక్ష.................................................. 93

రూపకం.................................................. 97

కవిత్వనిర్మాణ పరికరాలు–పరిభాష .................. 105

కవిత ఎలా రూపుదిద్దుకుంటుంది?! ................. 133

కవిత్వం కావాలి... కవిత్వం! ......................... 139



# కవిత్వంచెట్టుకు కొత్తచిగుళ్ళు తొడిగిన 'సృజనానుభవ' వసంతం

A poem is a manifestation of language and thus essentially a dialogue, can be a message in a bottle, sent out in the - not always greatly hopeful - belief that somewhere and sometime it could wash up on land, on heartland perhaps. Poems in this sense, too, are under way: they are making toward something.

- Paul Celan

నట్టనడి సంద్రంలో నావికుడొకడు భీకరమైన తుఫానులో ఇరుక్కుపొయ్యిండు. చుట్టూ ఎటు చూసినా భయంకరంగా గర్జించే సముద్రం – ఎగసి ఎగసిపడి లేస్తున్న తాడెత్తు అలలు – భీకరమైన గాలులు – కొన ఊపిరితో మునగడానికి సిద్ధంగా ఉన్న నావ – ఎక్కడా దరిదాపుల్లో లేని సహాయం – కనుచూపుకు అందని తీరం – నావికుడు బ్రతుకుమీద ఆశ

వదులుకున్నడు – తన చేతిలో ఉన్న ఒక సీసాను సముద్రం లో విసిరేసినడు – ఆ సీసా మూతి మూసివేసి ఉన్నది – లోపల ఒక కాగితమున్నది – అందులో నావికుడు యేదో రాసినడు – బహుశా ప్రపంచానికి తను చెప్పదల్చుకున్న చివరి మాటలేమో? తన చివరి సందేశమేమో? లేదూ ఎవరికైనా తన చిట్టచివరి ప్రేమలేఖనేమో? అది యెవరికోసం రాసిండో తెలియదు – అది ఎవరికి అందుతుందో తెలియదు అసలు అందుతుందో లేదో తెలియదు? యే తీరానికి కొట్టుకుపోతుందో తెలియదు. ప్రతి రోజూ సముద్ర తీరాలకు  కొట్టుకు వచ్చే, అనేక చెత్తా చెదారాల మధ్య ఎక్కడ ఆ సీసా సమాధి అయిపోతుందో తెలియదు – అయినా నావికుడు తన సందేశం రాసిండు –అది ఎవరికి యెక్కడ యెలా అందుతుందో తెలియని నావికుడు తను ప్రపంచానికి చెప్పదలుచుకున్నది మాత్రం సందేశంగా ఆ సీసాలో పంపించేసిండు. అది ఎవరికి అందుతుందో తనకు సంబంధం లేదు – యెవరికీ అందక పోవచ్చు కూడా – అదీ తెలుసు నావికునికి – ఆ సీసా ప్రపంచంలో యే తీరం లో యెవరికి దొరుకుతుందో – దొరికిన వాళ్ళు దానిలో సందేశముందని గుర్తిస్తరో లేదో – సీసాలో ఉన్న సందేశం భాష వారికి తెలుస్తదో లేదో – తెలిసినా నావికుడు చెప్పదలుచుకున్నది వాళ్ళకందుతదో లేదో....

అదీ కవిత్వమంటే!

కవి నావికుడు – కవిత రాస్తున్న ప్రతి సారీ నట్టనడి సంద్రంలో భీకరమైన పెనుతుఫానులో చిక్కుకుపొయ్యి తను ఇంక ఉంటడో లేడో తెల్వని పరిస్థితి – కానీ తను చెప్పదలుచుకున్నది చెప్పాలె – ఎవరికి అందుతుందో లేదో తెలియదు, అసలు అందుతుందో లేదో తెలియదు అందినా అర్థమవుతుందో లేదో తెలియదు – కానీ చెప్పదల్చుకున్నది చెప్పాలె – అంతవరకే కవి బాధ్యత – ఆ తర్వాత ఆ సీసా, దానిలోని సందేశం అందుకున్నవాళ్ళవే – ఇంకా కవికి సంబంధం లేదు–

సందేశమందుకున్న వాళ్లకూ కవి ఎవరో తెలియదు – ముందసలు ఆ సీసాలో సందేశముందనీ తెలియదు – తెరిచి చూసినంక ఆ భాష కూడా తెలియక పోవచ్చు – బాష తెలిసినా రాసిన సందేశం అర్థంకాకపోవచ్చు  – కానీ సందేశం మాత్రం అందింది – యెవరో బహుశా నడిసంద్రం తుఫానులో చిక్కుకుపొయ్యి అది పంపినరని అర్థం అయింది – ఆ సీసాలోని సందేశంలో మృత్యువుతో (లేదా మృత్యువు

# కవిత్వమంటే...

ఆలోచనల చెలమలు, భావావేశాల ఊటలతో మనో మస్తిష్కాలు నిండిపోయి, ఆ భారాన్ని భరించలేని మనసు, ఒత్తిడిని తట్టుకోలేని గుండె మతాబులా వెలిగి చీకటిలో చమక్కుల వెలుగులు పంచుతూ, నిప్పురవ్వలు రగిలిస్తూ అక్షరాలు సాక్షాత్కరించడమే కవిత్వం.

చాలా మందికి కవిత్వం కూడా గణితం లాంటిదే. రెండు అర్థం కాని కఠినమైన విషయాలుగా భయపెడుతుంటాయి. కవిత్వ పంక్తుల్లో పాతకాలం నాటి మసకమసక దృశ్యాలను అర్థం చేసుకోలేమని కొందరు భావిస్తారు. వర్తమాన జీవితాలు, వర్తమాన సమస్యల గురించి ప్రస్తావన కవిత్వంలో ఎక్కడుంది అని అడిగేవారూ ఉన్నారు.

కవిత్వం అన్నది గతించిన సంఘటనల జాబితా కాదు. కవిత్వం ఎల్లప్పుడు మన చుట్టూ ఉంటుంది. మనతో ఉంటుంది. మనం చూసే, వినే, రుచి చూసే, తాకి చూసే అన్నింటా కవిత్వం తొణుకుతోంది. ఎఫ్ ఎం రేడియోలో పాటల రూపంలో వినిపించేది కవిత్వం. క్రికెట్ మైదానం

పరుగుల్లో ప్రవహించేది కవిత్వం. రోజువారి సంభాషణల్లో దొర్లేది కవిత్వం. మనం చెప్పకుండా మనసుల్లో దాచుకున్న ప్రతి మాటలోను దాగి ఉన్నది కవిత్వం. కవిత్వం మన జీవితాల్లో ఉంది. జీవితాన్ని పూర్తిగా తెలుసుకోడానికి ఉపయోగపడే సాధనం కవిత్వం. మన జీవితాల్లో, మన తోటి వారి జీవితాల్లో సంపూర్ణంగా జీవించడానికి తోడ్పడేది కవిత్వం. ఆ కవిత్వాన్ని మనం గుర్తించినా గుర్తించకపోయినా, నమ్మిన నేస్తంలా మన వెంట నడుస్తోంది కవిత్వం.

విద్యార్థులు సాధారణంగా ఇంజనీర్లు, డాక్టర్లు, లాయర్లు కావాలనుకుంటారు. కొందరు రాజకీయ నాయకులు కావాలనుకుంటారు. ఇంకొందరు పైలట్లు కావాలనుకుంటారు. కాని చాలా తక్కువమంది మాత్రమే కవులు కావాలనుకుంటారు. గుర్తించవలసిన విషయమేమంటే, ప్రతి ఇంజనీరు, డాక్టరు, లాయరు, రాజకీయనాయకుడు, పైలట్ ఇంకా ఇలాంటి అనేకమంది హృదయాల్లో ఎక్కడో ఏదో ఒక మూల ఒక కవి నిద్రిస్తూనే ఉంటాడు. ఆ కవిని నిద్రలేపిన ప్రతి మనిషి కవిత్వం రాస్తాడు. కవిత్వం రాయడమంటే జీవించడం. కవిత్వం రాయడమన్నది కేవలం ఒక పని చేయడం కాదు.

స్కూల్లోను, కాలేజీల్లోను చాలా మంది లాంగ్వేజ్ సబ్జక్టులో కవిత్వాన్ని చదివే ఉంటారు. క్లాసు ఎప్పుడు ముగుస్తుందా అని ముళ్ళపై కూర్చుని క్లాసు పూర్తికాగానే రెక్కలు విదిలించుకుని ఎగిరిపోయి ఉంటారు. అక్కడ క్లాసులో విన్నది కవిత్వం కాదు, కాని ఆ తర్వాత జీవితం రెక్కలు విప్పుకుని ఎగిరిపోడానికి చూపిన ఆతృత కవిత్వం. ఆ ఆతృత అక్షరాలుగా కాగితంపై మెరిస్తే అదే కవిత్వం.

కవిత్వం రాయడం కాదు, మనకు కావలసింది కవిత్వంగా జీవించడం. అప్పుడు ప్రతి రోజు కవిత్వమే, ప్రతి క్షణమూ కవిత్వమే. ప్రతి శ్వాస కవిత్వమే. ప్రతి మాట కవిత్వమే.

కవిత్వాన్ని చదువుతామని మనం అనుకుంటాం. కాని, నిజానికి నవల లేదా కథ మాదిరిగా చదివేది కాదు కవిత్వం. వివిధ శాస్త్ర గ్రంథాల మాదిరిగా అధ్యయనం చేసేది కూడా కాదు కవిత్వం. ఇది ఒక అనుభూతి.

# అసలు కవిత్వం అంటే ఏమిటి?

ఈ ప్రశ్నకు చాలా జవాబులు కూడా వినిపిస్తాయి. ఈ జవాబుల్లో అత్యంత బలహీనమైన జవాబేదంటే, మాత్రలు, గణాల లెక్కలతో మీటర్ ప్రకారం రాసేదే కవిత్వం అనే జవాబు. ఈ జవాబు వల్ల ప్రాస పదాలు, ముఖ్యంగా అంత్యప్రాసలు ఉంటేనే కవిత్వమనే మరో అభిప్రాయం బలపడిపోతుంది.

కాని కవిత్వమంటే అక్షరాల లెక్కలు కాదు. నిజానికి కవిత్వం స్వాభావికంగా ఒక ప్రత్యేకమైన భాష, ప్రత్యేక భావవ్యక్తీకరణ. కవిత్వం కేవలం కవితల్లోనో లేక పద్యాల్లోనో ఉంటుందనుకుంటే పొరబాటు. కవిత్వం వచనంలో కూడా కనిపించవచ్చు. నిజానికి కవిత్వానికి భాషాపరమైన పదాల సాధనాలు కూడా అవసరం లేకపోవచ్చు. ఇతర శ్రవ్య పరికరాలు, అంటే సంగీత వాయిద్య ధ్వనులు కూడా కవిత్వంగా మారవచ్చు. నిజానికి ఇతర కళారూపాలు  శిల్పకళ, చిత్రకళ వంటివి దృశ్యపరమైన అనుభూతిని కలిగిస్తాయి. సంగీతం శ్రవ్యపరమైన అనుభూతిని కలిగించే కళారూపం. సంగీతం వినేవారిలో

అనిర్వచనీయమైన అనుభూతులను, భావావేశాలను ఎలా సృష్టిస్తుందో, కవిత్వం కూడా మనిషి చెవుల ద్వారా గుండెతలుపులను తట్టడమే కాదు, మనిషి కళ్ళ ద్వారా, అంటే చదవడం ద్వారా కూడా మనిషి హృదయపు లోతులను స్పర్శిస్తుంది.

ఏది కవిత్వం, ఏది కవిత్వం కాదు, ఈ రెంటికి మధ్య భేదం ఏమిటన్నది నిర్వచనానికి అందదు. ఇది అనుభూతికి సంబంధించిన విషయం. ఇది వ్యక్తిగతమైనది కూడా, ఎందుకంటే వ్యక్తిగతంగా అభిరుచులు మారినట్లే, అనుభూతులకు ప్రేరణలు కూడా వేర్వేరుగా ఉండవచ్చు.

అసలు ఏది కవిత్వం అని చర్చించడం కన్నా, కవిత్వం ఏం చేస్తుంది? అన్న చర్చ అర్థవంతంగా ఉంటుంది. కవిత్వం అనుభూతులను తట్టిలేపుతుంది. భావావేశాలను కదిలిస్తుంది. ఇదే అనుభూతిగా మనం చెప్పుకోవచ్చు.

సాధారణ వచనం, అది ఒక సమాచారాన్ని అందిస్తుంది, దాన్ని అర్థం చేసుకోడానికి మనిషి ప్రయత్నిస్తాడు. సైన్సు గురించి రాసిన వ్యాసమో, రాజకీయాలను విశ్లేషించిన వ్యాసమో చదువుతున్నప్పుడు దాన్ని అర్థం చేసుకోడానికి ఆ సమాచారాన్ని గ్రహించడానికి మనిషి ప్రయత్నిస్తాడు. అలాగే కథలు, నవలలు చదువుతున్నప్పుడు అందులోని సంఘటనల పరంపర ద్వారా ఆయా సన్నివేశాలను అర్థం చేసుకోడానికి, సమాజానికి, తన జీవితానికి అనువర్తించడానికి ప్రయత్నిస్తాడు. కాని కవిత్వం చదువుతున్నప్పుడు, లేదా వింటున్నప్పుడు మనిషి ఆలోచనల కన్నా భావావేశాలు, అనుభూతులు ముఖ్యంగా ప్రభావితమవుతాయి. వచనం ఒక సమాచారాన్ని చేరవేస్తుంది. కవిత్వం అనుభూతులను చేరవేస్తుంది. వచనం మనిషిలో ఆలోచనలను తట్టిలేపి అతడికి నచ్చచెప్పడానికి, అర్థం చేసుకునేలా చేయడానికి ప్రయత్నిస్తుంది. కవిత్వం మనిషిని కదిలించడానికి, స్పందించేలా చేయడానికి ప్రయత్నిస్తుంది. వచనం మనిషి ముందు వివిధ వాదనలను, వాటి వెనుక ఉన్న హేతుబద్ధతను వివరిస్తుంది. కవిత్వం మనిషి భావావేశాలను ప్రభావితం

# కవిత్వం చదవడంకూడా సృజనానుభవమే!

కవిత్వం కావాలి కవిత్వం. కవిత్వం జీవితంగా మార్చుకోవడమంటే ఏమిటి? కవిత్వం రాయడమా? కవిత్వం రాయడం మాత్రమే కాదు, కవిత్వాన్ని చదవడం, కవిత్వాన్ని తన ధర్మంగా మార్చుకోవడం.

అందుకే కవిత్వమేమిటి? అన్న ప్రశ్న చాలా ముఖ్యమైనది.

కవిత్వం మనిషి అంతరాత్మతో సంభాషణ వంటిది. ఈ సంభాషణ కవిలోనే ఉన్న కవితాత్మక ధ్యానంలో కొనసాగుతుంది. ఈ సంభాషణల ఫలితమే కవితగా వ్యక్తమవుతుంది. అంతరాత్మతో కవి ఏం మాట్లాడుతాడు. ప్రపంచం గురించి, ప్రపంచంలో తాను చూస్తున్న వాటి గురించి, మనుషుల గురించి, వారి జీవితాల గురించి మాట్లాడుతాడు. మానవసమాజాల్లో భావప్రకటనకు సాధనంగా భాష రూపుదిద్దుకున్నప్పటి నుంచి కవిత్వం లోతయిన భావాలను ప్రకటించే ప్రత్యేక భాషగా, సమాంతర భాషగా ప్రవహిస్తూనే ఉంది. సమాజంలో మేధో సంస్కృతి

వికసించి, భావవ్యక్తీకరణకు అవసరమైన బలమైన భాషా సాధనాలు రూపుదిద్దుకున్నప్పుడు, తమ అనుభూతులను, భావావేశాలను మరింత అందంగా అద్భుతమైన ప్రతీకలతో ప్రకటించే అవకాశం కలుగుతుంది. అంటే భాష ఎంత బలంగా ఉంటుందో, దానికి సమాంతరంగా ప్రవహించే కవిత్వ భాష కూడా అదే స్థాయిలో మరింత బలంగా ఉంటుంది.

కాని ప్రతి ఒక్కరు కవిత్వం రాయగలరా?

మనిషి అంతరంగంలో భావతీవ్రత ఉన్నప్పుడు మాత్రమే కవిత్వం రాయగలడు. మనిషిలో భావావేశాలు బలంగా ఉన్నప్పుడు మాత్రమే కవిత్వం రాయగలడు. మనిషిలో భావావేశాలు తీవ్రస్థాయికి ఎప్పుడు వెళతాయంటే, ఇతరుల భావావేశాలను అర్థం చేసుకున్నప్పుడే.

ఇతరుల కష్టాలు, ఇతరుల వేదనలు, రోదనలు, ఆర్తనాదాలు తనవిగా భావించినప్పుడే, అలాగే ఇతరుల సంతోషాలు, ఆనందాలల్లో తాను మమేకమైనప్పుడే అంటే సమాజంలో తోటివారి జీవితాల్లోకి తనను తాను మూసపోసుకున్నప్పుడే కవిలో బలమైన భావావేశాలు జనిస్తాయి. అంటే కవి తనలో ఉప్పొంగుతున్న లావాను ఒక అగ్నిపర్వతంలా బయటకు వెళ్లగక్కుతాడు. తనలో నిబిడీకృతమైన ఆర్ద్రతను ఒక నల్లని మబ్బులా వర్షిస్తాడు. ఇది అసంకల్పితంగా జరిగే చర్య. ప్రశంసల కోసమో, మెచ్చుకోళ్ళ కోసమో రాసేది కాదు. రాయకుండా ఉండలేడు కాబట్టి రాస్తాడు. రాయకుండా బతకలేడు కాబట్టి రాస్తాడు.

స్వచ్ఛమైన మానవ భావావేశాలను ప్రతిబింబించేలా రాసిన ప్రతి పంక్తి కవిత్వంగా నిలబడుతుంది. చాలా మంది తీవ్రమైన భావావేశాలకు గురయినప్పుడు అనుకోకుండా కవిత్వం రాయడం జరగవచ్చు. అలా రాసిన అక్షరాలు పాఠకుడిని కదిలిస్తాయి. కంట నీరు పెట్టిస్తాయి. అవి ఆనందభాష్పాలు కూడా కావచ్చు. సాహిత్య ప్రక్రియల్లో మనిషి కంట నీరు పెట్టించడం మరో ప్రక్రియ వల్ల కష్టమే. అందువల్లనే మనిషి భావావేశాలను ప్రభావితం చేసే సంగీతం కూడా కవిత్వాన్నే ఆశ్రయిస్తుంది.

కవిత అంటే అది భావావేశాలకు నిలయం. అద్భుతమైన రూపకాలు, ఉపమ, ఉత్ప్రేక్ష, ప్రతీకలతో మనిషి కళ్ళ ముందు అనేక

# కవిత్వం సాపేక్షం

కవిత్వం సాపేక్షమైందనిపిస్తుంది. మనం ఇంతకు ముందు చెప్పుకున్నాం, మనసును కదిలించేది, కంటిలో వెలుగుపూల వంటి అశ్రు బిందువులు వికసించేలా చేసేది, గుండెల్లో తడి ఊటలు ఉబికేలా చేసేది కవిత్వం. మనిషిని కదిలించేదే కవిత్వం.

కవిత్వం కూడా సాపేక్షమైందని ఎందుకనిపిస్తుందంటే ఉదాహరణకు మనం రోజూ రోడ్డున నడుస్తూ దయనీయస్థితిలో బతుకుతున్న వీధిబాలలను, ఫుట్‌పాత్ పైనే రోజులు వెళ్ళదీసే అభాగ్యులను చూస్తుంటాం. చూసిన వారిలో కొందరు పట్టించుకోకుండా వెళ్ళిపోతారు. కొందరు అయ్యో అనుకుంటారు. కొందరు పాపం అని కొంత చిల్లర వారికిచ్చి సహాయపడ్డామన్న తృప్తితో వెళతారు. చాలా తక్కువ మందికి బహుశా వారిని చూస్తే కళ్ళల్లో నీళ్ళు తిరుగుతాయి. అమాయకమైన ముఖంతో, చిన్ని చిన్ని చేతులతో కారు అద్దాలు తుడుస్తున్న పసిపువ్వులను చూసి, గుండె మెలితిరిగి కంట నీరు ఉబికే అనుభవం ఎంతమందికి ఉంటుంది? ఈ ప్రతిస్పందన మానవసహజమైన ప్రతిస్పందన. కాని ప్రతిస్పందన అందరిలోను ఉండదు కదా.

ఇక్కడ సాపేక్షం అనే పదాన్ని ఎందుకు వాడానంటే, కొందరిని కొన్ని దృశ్యాలు వెంటనే స్పందించేలా చేయవచ్చు. వీధిబాలల పరిస్థితికి కొందరు చలించక పోవచ్చు. కాని వారు ఫుట్‌పాత్‌పై బతుకుతున్న నిర్భాగ్యుల స్థితి చూసి అంతే సున్నితంగా స్పందించకపోవచ్చు. అంటే ప్రతి వ్యక్తి స్పందించే పరిస్థితులు వేర్వేరుగా ఉంటాయి. ప్రతి వ్యక్తిలో స్పందన కలుగజేసే రిసెప్టివ్ ఏజంట్లు వేర్వేరుగా ఉండొచ్చు. అలాగే ప్రతి కవి స్పందించే అంశాలు వేర్వేరుగా ఉండొచ్చు. అదేవిధంగా ప్రతి పాఠకుడు ప్రతి కవితకు స్పందించడం జరగదు. పాఠకుడిలో రిసెప్షన్‌కు అనుకూలమైన అంశాలున్న కవితపట్లనే పాఠకుడిలో స్పందన కలుగుతుంది. అలాంటి స్పందన కలుగజేయడానికి ఒకే ఒక్క వాక్యం చాలు. ఆ ఒక్క వాక్యమే ఒక కవితగా ఆ పాఠకుడిని కదిలించవచ్చు.

అందుకే భావావేశాలను కవిత్వీకరించడానికి కవులు వివిధ సాధనాలను ఉపయోగించడం, విభిన్న పనిముట్లను వాడుకోవడం జరుగుతుంది. కవి తనలోని భావావేశాలను పాఠకుడిలో కూడా సృష్టించడానికి భాషాపరంగా ఉపయోగపడే వివిధ పరికరాలు వాడుకుంటాడు. ఈ పరికరాలను ఉపయోగించడం ద్వారా తాను అనుకున్న భావావేశాలను పాఠకుల్లో సృష్టించే ప్రయత్నం చేస్తాడు. ఒక్కోసారి చాలా సాదాసీదాగా లేదా సంభాషణగా రాసిన పంక్తులు కూడా గొప్ప కవితలుగా పాఠకుల గుండెల్లో గూడుకట్టుకోవడం జరగవచ్చు. దానికి కారణం ఆ పంక్తుల్లో పాఠకుల్లో స్పందన కలుగజేసే సామర్థ్యం ఉండడమే. అలాంటి సామర్థ్యాన్ని తాను రాసే పంక్తుల్లో నింపడానికి ఒక్కోసారి భాషాపరమైన పరికరాలు కవికి అవసరమవుతాయి. ఆ పరికరాలేమిటో కూడా ఒకసారి చూద్దాం.

కవులు తాము అనుకున్న స్పందనను పాఠకుల్లో కలుగజేయడానికి ధ్వనిప్రధానమైన, భావప్రధానమైన రెండు రకాల పరికరాలు ఉపయోగించడం సాధారణంగా జరుగుతుంది. వీటిని తెలుగులో మనం అలంకారాలుగా వ్యవహరిస్తాము. ధ్వని ప్రధానమైన అలంకారాలు సాధారణంగా ఛందోబద్ధమైన కవిత్వానికే అవసరం అనుకుంటాము,



# భావం, భావుకత, సహజలయ

మనం శబ్దాలంకారాల గురించి ముఖ్యంగా వచనకవిత్వంలో సహజలయ గురించి మాట్లాడుకున్నాం. శబ్దాలంకారాలు వచన కవిత్వానికైన అవసరమే. "పతితులార, భ్రష్టులార, బాధాసర్ప ద్రష్టులార..." ఈ కవితలో వరుగసా ఆవృతమయ్యే "లారా" అన్న అక్షరాలను గమనిస్తే, వచనకవిత్వంలో అయినా శబ్దం గొప్ప భూమిక పోషిస్తుందన్నది స్పష్టమవుతుంది. ఇదివరకు మనం వృత్త్యనుప్రాసాలంకారం గురించి మాట్లాడుకున్నాం. మనకు ఉన్న శబ్దాలంకారాల్లో ఒకే అక్షరం ఆవృతి కలిగిన శబ్దాలంకారం ఒక్క వృత్త్యనుప్రాసమే. మిగిలిన అలంకారాలన్నింటిలోను కొన్ని అక్షరాల సముదాయం ఆవృతమవుతూ ఉంటుంది. వచన కవిత్వాన్ని రాస్తున్నప్పటికీ శబ్దంపై, నడకపై పట్టు ఉంటే అద్భుతమైన కవితలు రాయగలం. శ్రీశ్రీగారి మహాప్రస్థానమే అందుకు మంచి ఉదాహరణ. ఛందస్సుపై శ్రీశ్రీగారికి ఉన్న అవగాహన, ఛందస్సుపై ఉన్న అధికారం వల్లనే చందస్సు సంకెళ్ళను తెగ్గొట్టిన వచనకవిత్వంలోనూ తిరుగులేని శబ్దసౌందర్యాన్ని, అద్భుతమైన నడకను సాధించారు. తెలుగు ప్రజలు ఎన్నటికీ మరువలేని, తెలుగునేలను ఒక్క ఊపు ఊపిన కవిత్వాన్ని అందించారు.

కవిత్వంలో sound play ఉంటుంది. ఇందులో meter, rhyme scheme, word sounds ఇవి మూడు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఇందులో మీటర్, రైమ్ స్కీమ్ అనేవి ఛందోబద్ధమైన కవిత్వానికి సంబంధించినవి. ఛందోబద్ధమైన కవిత్వమేదైనా సరే అందులో ఖచ్చితంగా సౌండ్‌ప్లే ఉంటుంది. వచనకవిత్వానికి సంబంధించి, భావం, భావుకత, సహజలయ.. ఇవి మాత్రమే ముఖ్యమైనవి. అందువల్ల వచనకవిత్వానికి రైమ్ స్కీమ్, మీటర్లతో పనిలేదు. కాని వర్డ్ సౌండ్స్ లేదా పదశబ్దాలు అనేవి వచనకవిత్వంలోను ముఖ్యమైనవే. ఇంగ్లీషులో అయితే అల్లిటరేషన్, అస్సోనెన్స్, కన్సోనెన్స్ వంటి అలంకారాల ద్వారా ఈ సౌండ్‌ప్లే సాధిస్తారు. మనకు శబ్దాలంకారాలు ఇలాంటి అవకాశాన్నే ఇస్తాయి.

ఇప్పుడు శబ్దాలంకారాల్లో రెండవ అలంకారం ఛేకానుప్రాసం గురించి తెలుసుకుందాం.

మనం ఇంతకు ముందు చదువుకున్న వృత్త్యనుప్రాసాలంకారంలో కేవలం ఒకే అక్షరం ఆవృతమవుతూ వస్తుందని చదువుకున్నాం. ఇలా ఒకే అక్షరం రిపీటయ్యే అలంకారం కేవలం వృత్త్యనుప్రాసం ఒక్కటే. మిగిలిన శబ్దాలంకారాల్లో రెండు లేదా అంతకన్న ఎక్కువ అక్షరాలు రిపీటవుతాయి. అయితే ఇలా రిపీటయ్యే అక్షర సముదాయాలు వెంటవెంటనే, రిపీట్ అయితే అవ్యవధానంగా ఆవృతమవ్వడం. అలా కాకుండా ఈ అక్షరసముదాయాలు వెంటవెంటనే కాకుండా మధ్యలో మరో పదమో అక్షరాలో వచ్చిన తర్వాత రిపీట్ అయితే వ్యవధానంగా ఆవృతమైనట్లు లెక్క.

ఈ వివరాల తర్వాత మనం శబ్దాలంకారాల్లో మిగిలిన వాటిని అర్థం చేసుకోవచ్చు.

ఛేకానుప్రాసాలంకారంలో కొన్ని అక్షరాల సముదాయం వెంటవెంటనే ఎలాంటి వ్యవధానం లేకుండా రిపీట్ అవుతుంది. అయితే అర్థపరంగా వాటిమధ్య తేడా ఉండాలి. అంటే అక్షర సముదాయం ఒకటే అయినా మొదటిసారి ప్రయోగించిన అర్థానికి, రెండవసారి ప్రయోగించిన అర్థానికి మధ్య తేడా ఉండాలి. ఈ అక్షర సముదాయాన్ని వెంటవెంటనే,

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Srujananubhavam**

* * *